

చైతన్యపురి పీఎస్ ఎదుట ఉన్న సర్వీస్ రోడ్డుపై పార్క్ చేసిన వాహనాలు

## అధునాతన హంగులు సరే

# పార్కింగ్ స్థలం ఏది?

- సరూర్‌నగర్, చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లకు పార్కింగ్ పరేషాన్
- బయట వాహనాలు పార్క్ చేస్తే చలానాల బెడద
- ఫిర్యాదుదారులకు తప్పని అవస్థలు

**దిల్‌సుఖ్‌నగర్, ఆగస్టు24 (ఆంధ్రజ్యోతి):** రాచకొండ కమిషనరేట్. ఎల్బీనగర్ డివిజన్‌లో గల సరూర్‌నగర్, చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లు విజయవాడ జాతీయరహదారికి ఆనుకుని రోడ్డుకు ఇరువైపులా ఉన్నాయి. వాటికి పార్కింగ్ సదుపాయం లేదు. స్టేషన్‌కొచ్చే ఫిర్యాదుదారులు వాహనాలను పార్క్ చేసేందుకు అవస్థలు పడాల్సి వస్తుంది. స్టేషన్ ఆవరణలోకి బైక్‌లు తీసుకొస్తే చివాట్ల మోత...స్టేషన్ బయట పార్కు చేస్తే చలాన్ల వాత అన్నట్లుగా పరిస్థితి ఉంది.

### సిబ్బంది వాహనాలతోనే కిటకిట

సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ ఆవరణ పోలీస్ సిబ్బంది వాహనాలతోనే కిటకిటలాడుతోంది. శాంతి, భద్రతల విభాగం ఇన్‌స్పెక్టర్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌లకు చెందిన రెండు ఇన్నోవాలతోనే సగ భాగం నిండిపోయింది. ఇక ఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డుల ద్విచక్రవాహనాలు, సీజింగ్ వాహనాలను ఇక్కడే పెడుతున్నారు.

### బయట పెడితే ట్రాఫిక్ చలానా..

సరూర్‌నగర్ పీఎస్ ఆవరణలో ఫిర్యాదుదారులు, బాధితులు తమ వాహనాలను పార్క్ చేసేందుకు వస్తుండగా కొన్ని సార్లు గేటు దగ్గర విధుల నిర్వర్తించే సిబ్బంది రానివ్వకుండా హెచ్చరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. ఒక్కో చివాట్లు పెడుతున్నారని తెలుస్తోంది. దీంతో చేసేదిలేక స్టేషన్ బయట ఉన్న జాతీయ రహదారి పక్కనున్న ప్రాంతంలోనే వాహనాలు పార్క్ చేస్తున్నారు. ఇది నో పార్కింగ్ స్థలం కావడంతో ట్రాఫిక్ పోలీసులు చలాన్లు రాస్తున్నారు.

### చైతన్యపురిలో సిబ్బంది వాహనాలు బయటే.!

చైతన్యపురి పోలీస్ స్టేషన్ వద్ద ఎస్‌హెచ్‌వోతో పాటు స్టేషన్‌కు సంబంధించిన నాలుగు చక్రాల వాహనాలు పార్కు చేయడానికి కూడా పార్కింగ్ స్థలం లేదు. ఫిర్యాదుదారులు తమ వాహనాలను సర్వీసు రోడ్డుతోపాటు జాతీయ రహదారి పక్కనే పార్క్ చేస్తున్నారు. సిబ్బందిదీ ఇదే పరిస్థితి. దీంతో రద్దీ సమయాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.

**ఆధునీకరణ సమయంలో పార్కింగ్‌పై దృష్టి సారించకపోవడంతో..**

స్టేషన్‌ల మరమ్మతులు, అధునాతన హంగుల రూపకల్పనపై దృష్టి పెట్టిన పెద్దలు స్టేషన్ ఆవరణలో పార్కింగ్ స్థలాలపై కూడా దృష్టిసారించి ఉంటే బాగుండేదని పలువురు పేర్కొన్నారు. ఇకనైనా పార్కింగ్ స్థలాల ఏర్పాటు దిశగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని విన్నవిస్తున్నారు.



మంత్రాలచెరువును సందర్శించిన అదనపు కలెక్టర్ శ్రీనివాస్

## నిమజ్జన ఏర్పాట్లను సత్వరమే పూర్తి చేయండి

- రంగారెడ్డి అదనపు కలెక్టర్ శ్రీనివాస్

**సరూర్‌నగర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి):** గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న వినాయక నిమజ్జనోత్సవానికి చెరువుల వద్ద అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (ఎల్‌బీ) కె.శ్రీనివాస్ అధికారులకు సూచించారు. ఆదివారం ఆయన మీర్‌పేట్‌లోని మంత్రాలచెరువును సందర్శించి నిమజ్జన ఏర్పాట్లపై ఆరా తీశారు. చెరువు చుట్టూ కలియతిరిగి ఎక్కడెక్కడ ఎక్స్‌కవేటర్లు ఏర్పాటు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ దీపాల ఏర్పాటు, పోలీసు బందోబస్తు, చెరువు చుట్టూ రక్షణ చర్యలు, అగ్నిప్రమాద నివారణ చర్యలు, తాగునీటి వసతి, రోడ్ల మరమ్మతుల వంటి అంశాలపై ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. భక్తులకు, ఉత్సవ నిర్వాహకులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.

## జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

**సరూర్‌నగర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి):** నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా పలు సంస్థలు ఏర్పాటు చేసే ప్లేస్‌మెంట్ క్యాంపులను సద్వినియోగం చేసుకుని ఉద్యోగం సంపాదించుకోవాలని బీజేపీ మీర్‌పేట్ క్లస్టర్-2 అధ్యక్షుడు తులసి ముఖేశ్‌ముదిరాజ్ సూచించారు. ఆదివారం జిల్లెలగూడ కమలానెహ్రూనగర్ కాలనీ ముత్యాలమ్మ గుడి మైదానంలో సాహితీ సిస్టమ్స్ సహకారంతో ఏర్పాటు చేసిన దీన్‌దయాళ్ గ్రామీణ కౌశల్ యోజన ప్లేస్‌మెంట్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసుకున్న వారి కోసం ఈ క్యాంపు ఏర్పాటు చేశారని, యువతీయువకులు తమ పేర్లు నమోదు చేసుకుంటే సాహితీ సిస్టమ్స్ తరఫున ఉద్యోగావకాశాలు వస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి సిద్దాల శ్రీనివాస్, నాయకులు సూల ప్రభాకర్, కసిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, గాజుల మధు, దామోదర్‌రెడ్డి, గౌరీశంకర్, జిల్లెల ప్రభాకర్ రెడ్డి, తుమ్మల రమేశ్, వేణుగోపాల్‌రెడ్డి, ప్రసాద్, నిఖిల్‌సింగ్, భరత్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



సుదర్శన్‌ను సత్కరిస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్

## దళితరత్న అవార్డు గ్రహీతకు సత్కారం

**సైదాబాద్,ఆగస్టు24(ఆంధ్రజ్యోతి):** రాష్ట్రస్థాయిలో దళితరత్న అవార్డు అందుకున్న అంబేద్కర్ యువజన సంఘం యాఖత్‌పురా నియోజకవర్గం అధ్యక్షుడు కట్టా సుదర్శన్‌కు బాబుజగ్జీవన్‌రామ్, అంబేద్కర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆదివారం కుర్మగూడ భరత్‌నగర్‌లో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ దళితుల సమస్యలపై మరిన్ని ఉద్యమాలను సుదర్శన్ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇటికాల రాజు, హైకోర్టు క్లర్క్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రవణ్, నేతలు మోహనకృష్ణ, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగమయ్యనగర్ సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

**మన్సూరాబాద్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి):** మన్సూరాబాద్ డివిజన్ ఆగమయ్యనగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. సమస్యలపై కాలనీ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కాలనీలో సరైన రోడ్లు లేవని, గతంలో ఏర్పాటు చేసిన డ్రైన్ సరిపోవడం లేదని, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పందులు, కుక్కల బెడద ఉందని, ఓపెన్ వాటర్ లైన్ త్వరగా చేపట్టాలని, కాలనీ చివరలో అక్రమంగా గుడిసెలు వేసుకున్న వారు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, కాలనీ చివర డంపింగ్ యార్డుగా మారిందని తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. ఇటీవలే కాలనీ సమస్యలను జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్ దృష్టికి తీసుకెళ్లానని, త్వరలోనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, సీనియర్ నాయకులు టంగుటూరి నాగరాజు, పోచబోయిన గణేష్‌యాదవ్, యువ నాయకుడు జక్కిడి రఘువీర్‌రెడ్డి, రుద్ర యాదగిరి నేత, కన్న, దస్తగిరి, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

### ఓపెన్ జిమ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

మన్సూరాబాద్ డివిజన్ జడ్జెస్‌కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



లారీ ఓనర్లను సన్మానిస్తున్న యాదయ్య

## ఇసుక లారీ యజమానుల సంఘం సమావేశం

**మన్సూరాబాద్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర ఇసుక లారీ యజమానుల సంఘం సమావేశం మన్సూరాబాద్ డివిజన్ పల్లవి గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించారు. సంఘం ఆటోనగర్ అధ్యక్షుడు జగదీశ్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య, కార్యదర్శి సప్పిడి శ్రీనివాస్‌రెడ్డిలు విచ్చేశారు. ములుగు జిల్లాలో ఇసుక కాంట్రాక్టర్లు లారీ యజమానుల వద్ద లోడింగ్ డబ్బులు వసూలు చేయడం, బల్క్ ఆర్డర్లపై ఎదుర్కొనే సమస్యలపై చర్చించారు. అనంతరం పలువురు లారీ ఓనర్లయిన దేవనబోయిన మహేష్‌యాదవ్, బుంగ కిరణ్, గుట్టేటి మల్లేష్, కొత్త నాగరాజు, ఆవుల సత్యనారాయణ, ఈర్ల సురేందర్, ఎర్రబోయిన మహేష్, మైలుగాని శ్రీశైలం తదితరులు సంఘంలో చేరగా సన్మానించారు. సంఘం ఉపాధ్యక్షులు గుండు లింగన్నగౌడ్, సుర్వి లింగస్వామి, పాండుగౌడ్, ఆంజనేయులు ఉన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా ప్రధానకార్యదర్శి యాదయ్య

## ప్రభుత్వ భూమిలో పాతిన ఎర్రజెండాలు

**అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి):** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడలో ఉన్న ప్రభుత్వ భూమిలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఎర్ర జెండాలను పాతారు. ఆ స్థలంలో ఉన్న రాళ్లు, చెట్లను చదును చేశారు. కార్యక్రమానికి ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధానకార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏర్పుల నరసింహ హాజరయ్యారు. లష్కర్‌గూడ సర్వే నంబర్ 84లోని 3 ఎకరాల ప్రభుత్వ భూమిలో 1996లో అప్పటి ప్రభుత్వం స్థానిక పేదలను గుర్తించి ఇళ్ల స్థలాలను కేటాయించి సర్టిఫికెట్లను ఇచ్చిందన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇళ్లను నిర్మించుకోలేదన్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు ఇటీవల ఈ భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. ఆ స్థలంలో లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించి ఇచ్చే వరకు సీపీఎం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు వర్కాల ముత్యాలు, మేడిపల్లి శ్రీశైలం, గుండె శివకుమార్, సత్యనారాయణ, సుమలత, శ్రీను, బిక్షపతి, ఊషయ్య, శ్రీనివాస్, యాదయ్య, హరీష్‌తో పాటు సర్టిఫికెట్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఉద్యోగులకు బదిలీలు సహజం

- మలక్‌పేట ఏసీపీ సుబ్బిరామిరెడ్డి



బదిలీ అయిన సిబ్బందిని సన్మానిస్తున్న ఏసీపీ సుబ్బిరామిరెడ్డి, మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ నరేష్

**చాదర్‌ఘాట్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి):** పోలీసు ఉద్యోగం చేసే వారికి బదిలీలు మామూలేనని మలక్‌పేట ఏసీపీ సుబ్బిరామిరెడ్డి అన్నారు. మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించిన 17 మంది సిబ్బంది బదిలీ అయిన సందర్భంగా వారందరికీ మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్‌తో కలిసి ఆయన సన్మానించారు. పోలీసు ఉద్యోగంలో చేరిన అధికారులకు, సిబ్బందికి బదిలీలు జరగడం సహజమేనని అన్నారు. ఎక్కడ విధులు నిర్వర్తించినా బాధ్యతగా చేయడం ద్వారా మంచి గుర్తింపు పొందాలన్నారు. మలక్‌పేట ఎస్‌ఐలుగా పనిచేసిన సురేష్, నవీన్‌లకు పోలీసు ఉద్యోగం మొదటి పోస్టింగ్ అని, తర్వాత ఎక్కడ పనిచేసిన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ వారికి మదర్ స్టేషన్‌గా మిగిలిపోతుందన్నారు. మిగతా 15 మంది సిబ్బంది ఎక్కడ పని చేసినా బాధ్యతగా గుర్తింపు పొందేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. మలక్‌పేట అదనపు ఇన్‌స్పెక్టర్ జయశంకర్, ఎస్‌ఐలు సంజీవరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, తేజానాయక్, డబీర్‌పుర ఇన్‌స్పెక్టర్ నానునాయక్, అదనపు ఇన్‌స్పెక్టర్ ఉప్పా శంకర్ తోపాటు పలువురు పాల్గొన్నారు.



వడ్డేపల్లి రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

## నిజాన్ని నిక్కచ్చిగా చెప్పే అక్షరశిల్పి వడ్డేపల్లి కృష్ణ

- టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

**మన్సూరాబాద్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి):** తన పదాలతో నిజాన్ని నిక్కచ్చిగా చెప్పే అక్షరశిల్పి దివంగత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఐవీఎఫ్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. ఎల్బీనగర్‌లో వారి నివాసంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి వడ్డేపల్లి రచించిన 'సాయి చరితం-కీర్తనం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. వడ్డేపల్లి తన రచనలతో ఎందరినో ఉత్తేజపరిచారని, ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయమని ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. కార్యక్రమంలో వడ్డేపల్లి కుమారులు శ్రీకాంత్, శ్రీనాథ్, గంజి సత్యనారాయణ, చిలువేరు రఘురాం, ఎం.సత్యనారాయణ, ఈశ్వర్, పాండు తదితరులు పాల్గొన్నారు.



కళ్లజోళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలాల

## కళ్లజోళ్ల పంపిణీ

**చాదర్‌ఘాట్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి):** కంటి చూపు లోపం ఉన్న మహిళలకు కళ్లజోళ్లను ఆదివారం మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల పంపిణీ చేశారు. ఇటీవల కంటి పరీక్షలు చేయించుకున్న వారిలో కొందరికి కంటి చూపు లోపం ఉన్నట్లు గుర్తించారు. అందులో భాగంగా 50 మంది మహిళలకు ఆయన కంటి అద్దాలను అందజేశారు.

## గణేష్ ఉత్సవాలు జాగ్రత్తగా నిర్వహించుకోవాలి

**కొత్తపేట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి):** ఇతరులకు ఇబ్బంది కలుగకుండా గణేష్ నవరాత్రులు జాగ్రత్తగా నిర్వహించుకోవాలని ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య సూచించారు. ఆదివారం సాయంత్రం ఎల్బీనగర్ పీఎస్ పరిధిలోని కామినేని చౌరస్తా సమీపంలో గల ఓ ఫంక్షన్‌హాల్‌లో మండపాల నిర్వాహకులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఉత్సవాల పేరుతో బలవంతపు చందాలు వసూలు చేయరాదని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అర్ధరాత్రి వరకు డీజే, విపరీతమైన శబ్ద కాలుష్యం కలిగించేలా పాటలు వినిపిస్తూ పరిసర ప్రాంతాల వారికి అసౌకర్యాన్ని కలిగించరాదన్నారు. విద్యుత్ దీపాల ఏర్పాటులోనూ నాణ్యత ఉన్న తీగలను వాడాలని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా 100కు డయల్ చేయాలని సూచించారు. సమావేశంలో ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్, డీఐ నాగార్జునరెడ్డి, డీఎస్ఐ నరేందర్, ఎస్‌ఐలు పాల్గొన్నారు

## చేతికర్రలు, వినికిడి యంత్రాలు పంపిణీ

**హయత్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):** భారతీయ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ, సామాజిక సాధికారత మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో రాఘవేందర్‌నగర్ కాలనీలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి హాజరయ్యారు. వృద్ధులకు చక్రాల కుర్చీలు, వినికిడి యంత్రాలు, నెక్ బెల్టులు, నడుము మెల్టులు, నీ క్యాప్స్‌లను అందజేశారు. కేంద్ర ప్రభుత్వం పథకాలను ప్రజలకు అందేలా కృషి చేస్తున్న డాక్టర్ శ్రీదేవిని జీవన్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కాలనీకి చెందిన వృద్ధులు, సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.



క్రీడా మైదానం ప్రారంభోత్సవంలో కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి

## సంపూర్ణ ఆరోగ్యానికి క్రీడలు దోహదం : కార్పొరేటర్

**చంపాపేట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి):** సంపూర్ణ ఆరోగ్యానికి పిల్లలు, యువతకు క్రీడలు ఎంతో అవసరం అని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ మహంకాళమ్మతోటలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాన్ని ఆదివారం కార్పొరేటర్ ప్రారంభించారు. యువతకు క్రీడల నుంచి మంచి భవిష్యత్ ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లింగాల దశరథ్‌గౌడ్, కరుణాసాగర్, సిల్వేరు అనిల్‌కుమార్, కాలనీ అధ్యక్షుడు యోగిరాజ్, ఉపాధ్యక్షుడు వినేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కృష్ణ, వినోద్, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, అమన్‌సింగ్, శ్రీశైలం, భరత్ తదితరులు పాల్గొన్నారు.



నూతన సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

## ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు

- కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

**ఎల్‌బీనగర్,ఆగస్టు24(ఆంధ్రజ్యోతి):** ప్రజా అవసరాలకు అనుగుణంగా కాలనీలలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని కృష్ణానగర్ కాలనీలో రూ.72లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ఆదివారం ప్రారంభించారు. కాలనీ అధ్యక్షుడు ఎన్.కృష్ణ, ఎం.రామకృష్ణ, చంద్రశేఖర్, వెంకటేశ్వర్‌రావు, నల్గొండ శ్రీను, యాదగిరి, వెంకటేశ్వర్లు, శ్రీధర్‌గౌడ్, అనసూయ, ప్రవీణ్‌రెడ్డి, రోహిత్, నరేందర్, హరీష్, వెంకట్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావసరాలు తీర్చడమే లక్ష్యం : నర్సింహారెడ్డి

**మన్సూరాబాద్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి):** డివిజన్‌లో నెలకొన్న ప్రతీ సమస్యను పరిష్కరిస్తూ ప్రజావసరాలను తీర్చడమే లక్ష్యమని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధి బాలాజీనగర్ సమస్యలపై పర్యటించడంతో పాటు జడ్జెస్‌కాలనీలో రూ.10లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత సమాజం ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యంపై శ్రద్ధ చూపలేకపోతున్నారని, ఆరోగ్యం బాగుంటేనే ఏదైనా సాధించగలమన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతీ కాలనీలో ప్రజలకు చేరువగా ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఆయా కాలనీల సభ్యులు చంద్రారెడ్డి, దామోదర్ గౌడ్, సురేందర్‌రెడ్డి, వెంకటేష్, జనార్దన్‌రావు, ప్రభాకర్‌రావు, సుధీర్‌రెడ్డి, బాలరాజ్, వీరాచారి, అనిల్, శ్రీశైలం, నర్సింహాయాదవ్, రవికుమార్, బాలాజీ, జయతేజ, రమేష్‌చారి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.









సురవరం సుధాకర్‌రెడ్డి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, ఎల్‌బీనగర్ చౌరస్తాలో సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ ఎల్‌బీనగర్ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి తదితరులు. - (ఎల్‌బీనగర్,ఆంధ్రజ్యోతి)

## సురవరానికి నివాళి



సురవరానికి నివాళులర్పిస్తున్న పాండుగౌడ్, మల్లేశ్‌ముదిరాజ్

**సరూర్‌నగర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి):** సీపీఐ జాతీయ నాయకుడు, నల్గొండ మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి మృతికి మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్లకు చెందిన పలు పార్టీల నాయకులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆదివారం మీర్‌పేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మీర్‌పేట్ మాజీ సర్పంచ్ పల్లె పాండుగౌడ్, మాజీ కార్పొరేటర్ యెడ్ల మల్లేశ్‌ముదిరాజ్, నాయకులు కుంచె నాగేందర్‌గౌడ్, రామిడి బుచ్చిరెడ్డి, పెండ్యాల సత్యనారాయణ తదితరులు పాల్గొని ఆయన ఫ్లెక్సీకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మఖ్దూం భవన్‌కు వెళ్లి సురవరం పార్థివదేహాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.